సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



గంజాయి జోలికి పోవద్దు

గంజాయికి ప్రత్యామ్నాయంగా జీడి, రాజ్‌మా, సిల్వర్ ఓక్, కాఫీని సాగు చేసుకోవాలని ఎస్‌ఐ కె. రవీంద్ర సూచించారు. 8లో



కనకమ్మకు సహస్ర తులసిపూజ

విశాఖ నగరంలో బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. 8లో



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

ఎస్‌ఐ పరీక్ష అభ్యర్థులకు ఉచిత భోజన వసతి

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



కొయ్యూరు: విశాఖపట్నంలో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించనున్న ఎస్‌ఐ తుది పరీక్ష రాసేందుకు అరకు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వెళ్లే అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థుల ఇబ్బందులను ముందుగానే గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 2019లో జరిగిన గ్రామ,వార్డు సచివాలయ పరీక్షలకు కూడా ఆరు రోజుల పాటు 150 మందికి భోజన వసతి కల్పించామని గుర్తు చేశారు. పూర్తి వివరాలకు 9381558327, 7032264706 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

గర్భిణికి తప్పిన ప్రాణాపాయం

- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవానికి నిరాకరణ
- బలవంతంగా తరలించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం
- ఏరియా ఆస్పత్రిలో శిశువుకు జన్మనిచ్చిన గిరి మహిళ దేవిక



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో శిశువుతో దేవిక

చింతపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవానికి నిరాకరించిన గర్భిణిని సకాలంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి బలవంతంగా తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. పండంటి మగశిశువుకు జన్మనిచ్చింది. వివరాలిలావున్నాయి. గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పీహెచ్‌సీ పరిధిలోని చిన గంగవరానికి చెందిన గర్భిణి కోడా దేవికకు బుధవారం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఆమెను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ ఆమె వైద్య సేవలు పొందేందుకు నిరాకరించింది. వెంటనే ఆస్పత్రి వైద్యులు ఈ విషయాన్ని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఆమెను వైద్యులు బలవంతంగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. అక్కడ గురువారం ఉదయం మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యసిబ్బంది తెలిపారు.

డిస్కస్, జావెలిన్‌త్రోలో ప్రతిభ


- రాష్ట్రస్థాయి పోటీలకు మారేడుమిల్లి విద్యార్థి రవి ఎంపిక



ఎంపికైన విద్యార్థి రవితో పాఠశాల సిబ్బంది

మారేడుమిల్లి : కాకినాడలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించిన అండర్ 17 బాలుర విభాగం డిస్కస్‌త్రో, జావెలిన్ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గొల్లోరి రవి ప్రతిభ కనబరిచాడు. డిస్కస్ త్రోలో ప్రథమస్థానం, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా రవిని గురువారం పాఠశాల సిబ్బంది అభినందించారు. పీడీ సుదర్శన్, పీఈటీ కె. ప్రసాద్, కె. చిన్నారెడ్డి పాల్గొన్నారు.

28న మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనం



సింహాచలం : ఈనెల 28న చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు పునరుద్ధరిస్తామన్నారు. 28వ తేదీ రాత్రి ఆరాధన, 29న ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వర్ణపుష్పార్చన, గరుడసేవలు రద్దుచేసినట్లు పేర్కొన్నారు.

మారుమూల గ్రామాలకు ఉపాధి వరం

ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వరంలా మారింది. ఒకపక్క గిరిజనులకు ఉపాధి కల్పిస్తూ, మరోపక్క రోడ్ల నిర్మాణానికి దోహదపడుతోంది. డోలిమోత లేని గ్రామాలే లక్ష్యంగా ఐటీడీఏ చేపట్టిన కసరత్తు మంచి ఫలితాలనిస్తోంది. మూడేళ్లలో అన్ని గ్రామాలకు రోడ్ల సౌకర్యం అందుబాటులోకి రానుంది.

- రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులను వెచ్చిస్తున్న పాడేరు ఐటీడీఏ
- రూ. 289.11 కోట్లతో 407 పనులు
- మూడేళ్లలో అన్ని గ్రామాలకు అందుబాటులోకి రానున్న రహదారులు
- లక్ష్యసాధనతో దూసుకుపోతున్న అధికార యంత్రాంగం



జి.మాడుగుల మండలంలోని నిర్మిస్తున్న కుడ్డంగి- మునికర్లబొగు రోడ్డు

పాడేరు, అరకు నియోజకవర్గాల సమాచారం

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
పాడేరు	54	27.96
జి.మాడుగుల	72	48.95
చింతపల్లి	49	29.41
జి.కే.వీధి	74	59.1
కొయ్యూరు	31	18.61
అనంతగిరి	33	29.60
అరకులోయ	17	7.27
డుంబ్రిగుడ	18	12.69
హుకుంపేట	22	26.57
ముంచంగిపుట్టు	20	18.06
పెదబయలు	17	10.59
మొత్తం	407	289.11

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్‌లోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తున్నాయి. ఇందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఈ పనులకు కేటాయిస్తూ సద్వినియోగం చేస్తోంది. గ్రామాలకు మట్టిరోడ్లు, మెటల్‌రోడ్లు, తారురోడ్లు నిర్మించే లక్ష్యంతో చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పాడేరు ఐటీడీఏ పరిధిలో..

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 3,803 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 2155 గ్రామాలకు తారురోడ్లు, సీసీరోడ్లు, మెటల్ రోడ్ల సౌకర్యం ఉంది. అయితే 972 గిరిశిఖర గ్రామాలకు కనీసం రోడ్డు లేకపోవడంతో డోలి మోత గ్రామాలుగా ఐటీడీఏ గుర్తించింది. మరో 676 గ్రామాలకు మట్టిరోడ్లు ఉన్నప్పటికీ అధ్వానంగా ఉన్నట్టుగా సర్వేలో తేలింది. దీంతో ఈరెండు విభాగాలకు సంబంధించి 1648 గ్రామాలకు ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్ల నిర్మాణాలకు ఐటీడీఏ చర్యలు చేపట్టింది.

తొలిదశలో 397 రోడ్ల నిర్మాణాలు

గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా తొలిదశలో 397 రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందుకు సుమారు రూ.289.11 కోట్ల ఉపాధి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

- గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పాడేరు డివిజన్ వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.
- ఉపాధి హామీ పథకం ద్వారా నిధుల సమస్య లేకపోవడంతో రోడ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు వస్తున్నారు.
- గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్, పీవో ప్రత్యేక శ్రద్ధతో..

కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ రోడ్ల నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్నారు. ఈఏడాది డిసెంబర్ నాటికి తొలిదశలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పనిచేస్తున్నారు.

పరిధి: పాడేరు డివిజన్

మొత్తం గ్రామాలు	:	3,803
రోడ్డు సౌకర్యం	:	2155
రోడ్డు లేనివి	:	972
అధ్వానంగా ఉన్నవి	:	676
రోడ్లు నిర్మించాల్సినవి	:	1648

మూడేళ్లలో రోడ్లు పూర్తి



మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మాణంతో పాటు రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మన్యంలో డోలిమోత లేని గ్రామాలు లేకుండా ఉండేలా అంచెలంచెలుగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు అభివృద్ధి చెందడం మంచి పరిణామం. రానున్న మూడేళ్లలో అన్ని గ్రామాలకు పక్కా రోడ్ల సౌకర్యం అందుబాటులోకి రానుంది.

\- వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

ప్రతీ గ్రామానికి కమ్యూనిటీ పోలీసింగ్ విస్తరణ

ఎస్పీ తుహిన్ సిన్హా



సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కొయ్యూరు: కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రతీ గ్రామానికి విస్తరింపజేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. గురువారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలిచ్చారు. కమ్యూనిటీ పోలీసింగ్ ప్రాధాన్యతను వివరించారు. మారుమూల గిరిజనులకు ఎలాంటి సమస్యలున్నా వాటిని తెలుసుకోవాలని కోరారు. అదేవిధంగా గిరిజనులు తీసుకు వచ్చిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. దీనివల్ల పోలీసులపై గిరిజనులకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా చాలా వరకు గంజాయి పంటను నిర్మూలించామన్నారు. ఎక్కడైనా పంట వేసినట్టుగా సమాచారం వస్తే వెంటనే వెళ్లి దానిని ధ్వంసం చేయాలని సూచించారు. మంప పరిధిలో ఉన్న బూదరాళ్ల, ఎం బీమవరం, యూ.చీడిపాలెంలో పంచాయతీల్లో సమస్యలను ఆయన తెలుసుకున్నారు.

మన్యంలో చలిగాలులు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- అర్ధరాత్రి నుంచి దట్టంగా పొగమంచు
- 16 నుంచి 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు



పాడేరులో కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో మన్యంలో వాతావరణ మార్పులు ఏర్పడుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. పాడేరు మండలం మినుములూరులోని కేంద్ర కాఫీబోర్డులో గురువారం 16డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి తొమ్మిది గంటల తరువాత చలి గాలులు అధికంగా ఉంటున్నాయి. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. పాడేరు, అరకులోయ,చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు తీవ్రత నెలకొంటుంది. హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

వడ్డీ వ్యాపారిపై దాడి

- మారణాయుధాలతో గాయపరిచిన దుండగులు
- రూ.50 వేలు, సెల్ ఫోన్ లాక్కొని పరారీ
- కేసు నమోదు చేసిన పోలీసులు



తీవ్రంగా గాయపడిన అనివాష్‌రెడ్డి

చింతపల్లి: మండలంలోని అన్నవరం పంచాయతీ సోమవారం గ్రామానికి సమీపంలో ద్విచక్రవాహనంపై వస్తున్న వడ్డీ వ్యాపారిపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయుధాలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామానికి చెందిన ఉగిరెడ్డి అనివాష్‌రెడ్డి కొన్నేళ్లుగా లోతుగెడ్డ జంక్షన్‌లో మకాం ఉంటూ ఈ ప్రాంతంలోని గ్రామాల్లో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. దీనిలో భాగంగానే గురువారం ఉదయం ఐదు గంటల సమయంలో అన్నవరం మీదుగా సోమవారం వెళుతుండగా ముందుగానే మలుపువద్ద మాటువేసిన ఇద్దరు దుండగులు ఆయుధాలతో ఒక్కసారిగా అతనిపై దాడికి దిగారు. ముఖం, తలపై తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడే బాధితుడు కుప్పకూలి పోయాడు. దీంతో దుండగులు అతని జేబులో ఉన్న రూ.50 వేల నగదు, సెల్ ఫోన్ తీసుకుని పరారయ్యారు. కొంత సేపటికి తేరుకున్న బాధితుడు నెమ్మదిగా వాహనంపై సోమవారం చేరుకున్నారు. సంఘటన గురించి మాజీ సర్పంచ్‌కు వివరించారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయడమే కాకుండా బాధితుడిని అంబులెన్సులో చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పోలీసులు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎస్‌ఐ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు

14, 15 తేదీల్లో 19 కేంద్రాల్లో పరీక్ష

దొండపర్తి: ఆంధ్రప్రదేశ్ పోలీస్‌స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో జరగనున్న సబ్ ఇన్‌స్పెక్టర్(సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏపీఎస్‌పీ) అభ్యర్థుల మెయిన్స్ రాత పరీక్షలకు విశాఖ రేంజ్ డీఐజీ ఎస్. హరికృష్ణ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో 19 పరీక్షా కేంద్రాల్లో ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు పురుషులు 9,913 మంది, మహిళలు 1,452 మంది మొత్తంగా 11,365 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

అభ్యర్థులకు నిబంధనలు

- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ఒక గంట ముందుగా పరీక్షా హాలులో హాజరుకావాలి.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుంది.
- పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రదేశాన్ని ముందగానే గూగుల్ సెర్చ్ చేసుకొని లేదా ముందుగానే సందర్శించి పూర్తిగా అవగాహన చేసుకొని పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి.
- అభ్యర్థులు బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి.
- నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు(సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, బ్యాగ్‌లు, బ్లూటూత్ వంటివి) అనుమతి ఉండదు.
- అభ్యర్థులు వారి వెంట తెచ్చుకొనే విలువైన సామగ్రిని వారే భద్రపరచుకోవాలి.
- పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఎటువంటి లౌడ్ స్పీకర్స్, మైకులు అనుమతించరు.
- పరీక్షా కేంద్రం వద్ద జెరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోలు పరీక్షా సమయంలో మూసివేయాలి.
- కేంద్రం వద్ద 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుంది. దీంతో ప్రజలు గుంపులుగా ఉండకూడదు.
- బందోబస్తు నిర్వర్తించే సమయంలో పోలీసులకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.
- ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మోసపూరిత మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ సూచించారు.
- అటువంటి వారి గురించి తెలిస్తే డయల్ 112కు గాని, దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో గాని సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో జీసీసీ స్టాళ్లు

- సీలేరు ,చింతపల్లిలో సూపర్ మార్కెట్ల ఏర్పాటు
- కాఫీ ధర కిలోకు రూ.10 పెంపు
- గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ దేవరాజు



గూడెం కొత్తవీధిలో రికార్డులను పరిశీలిస్తున్న డివిజనల్ మేనేజర్ గణేష్



సీలేరులో పెట్రోల్ బంకు సిబ్బందితో మాట్లాడుతున్న మేనేజర్ దేవరాజు

సీలేరు: మన్యం పర్యాటక ప్రాంతాలకు దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులకు మన్యంలో దొరికే వస్తువులను విక్రయించేందుకు పర్యాటక ప్రదేశాల్లో జీసీసీ స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు చింతపల్లి డివిజనల్ మేనేజర్ దేవరాజు వెల్లడించారు. గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన జీసీసీ రేషన్ డిపో, పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు ధారాలమ్మ ఆలయం, లంబసింగి, కొత్తపల్లి జలపాతం తదితర ప్రాంతాల్లో స్టాళ్లను అందుబాటులోకి తెస్తామన్నారు. సీలేరు, చింతపల్లిలో సూపర్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ఏడాది కాఫీ గింజల కొనుగోలు ధర రూ. 10 పెంచామని చెప్పారు. ఈ ఏడాది కాఫీ గింజల కొనుగోలు ధరకు అదనంగా రూ.10 పెంచామని చెప్పారు. ఈ ఏడాది చింతపల్లి డివిజన్‌లో వెయ్యి మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. మన్యంలో తొలిసారిగా డౌనూరులో కాఫీ తయారీ కేంద్రం యూనిట్‌ను రూ.4 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. కాఫీ రైతులకు ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఒకొక్క రైతుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ మల్లేశ్వరరావు ఉన్నారు.

జీసీసీ కార్యాలయం, గొడౌన్ల తనిఖీ

గూడెంకొత్తవీధి: స్థానిక జీసీసీ బీఎం కార్యాలయం, గొడౌన్లను పౌరసరఫరాల శాఖ డివిజనల్ మేనేజర్ శ్యామ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు.

రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరఫరాలో ఎలాంటి జాప్యం జరిగినా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సకాలంలో రేషన్ సరకులను డిపోలకు చేరవేయాలని గొడౌన్ ఇన్‌చార్జి కృష్ణారావును ఆదేశించారు. జాప్యం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.ఏఎం అకౌంటెంట్ సాయి, జీసీసీ బీఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కండువా వేసి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

జి.మాడుగుల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో అధిక సంఖ్యలో చేరుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో వంతాల పంచాయతీలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 50 మంది వార్డు సభ్యుడితో సహా పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు కొర్రా సీతారాం, ఎం చంటి, దేముళ్లు, బాబూరావు, అప్పారావు, చిన్నారావు తదితరులు ఉన్నారు. ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు, ఎస్ రామకృష్ణ, కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్ మత్స్యకొండంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గసభ పంచాయతీ నుంచి సీపీఎం శ్రేణులు..

అరకులోయ టౌన్: డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీలో సీపీఎంకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పర్యాటక శాఖ హరిత వేలి రిసార్ట్స్‌లో జరిగిన కార్యక్రమంలో గసభ గ్రామ పంచాయతీకి చెందిన శిరోష్‌గుడ, కంగార్‌సోల్ల, శిమిలిగుడ గ్రామాలకు చెందిన సుమారు 70 మందికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై వారంతా వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. గ్రామంలో తాగునీరు, వంతెనలు, రహదారుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గసభ బీటీ రోడ్డు జంక్షన్ నుంచి శిరోష్‌గుడ వరకు రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరారు. వెంటనే ఆయన పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి రహదారి పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు వంతాల తామయ్య, సుబ్బారావు, జి. రమేష్, తదితరులు మాట్లాడుతూ ఇప్పటి వరకు సీపీఎం పార్టీని నమ్మి మోసపోయామన్నారు. ఆదిమజాతి గిరిజనులు నమ్మితే ప్రాణం పెడతామని, తామంతా జగనన్న వెంటే నడుస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో వంతాల రామారావు, కొర్రా ఆనందరావు, నీలన్న, గెమ్మెలి రాంచందూర్, తదితరులున్నారు. డుంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీపీలు రంజపల్లి ఉషారాణి, బాక ఈశ్వరి, ఎంపీటీసీ జెమ్మ, వైస్ సర్పంచ్ మోహన్‌దాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎల్‌బి, భీమరాజు పాల్గొన్నారు.



పాల నురగల తారబు

దివి నుంచి జాలువారుతున్నట్టుగా పాల నురగల తారబు జలపాతం ఆకట్టుకుంటోంది. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల సరిహద్దులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. అందుకు తగ్గట్టుగా వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

\- ముంచంగిపుట్టు

క్లుప్తంగా

బాలికలే దేశానికి పట్టుగొమ్మలు



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

సీలేరు: బాలికలే దేశానికి పట్టుగొమ్మలని, వారు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సురేష్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వ్యక్తిగత శుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి శ్యామల, హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ్ పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



పులుసుమామిడి రోడ్డు వద్ద ఢీకొన్న కారు, బైక్

జి.మాడుగుల: మండలంలో నుర్మతి–మద్దిగరువు రోడ్డులో పులుసుమామిడి గ్రామ సమీపాన గురువారం జి.మాడుగుల వైపు బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ సెల్ టవర్ పనుల నిమిత్తం వస్తున్న కారు, మద్దిగరువు వైపు వెళ్తున్న బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై వెళ్తున్న పాడేరు మండలం గొండెలి పంచాయతీ చీడిమెట్ట గ్రామానికి చెందిన వంతాల చిన్నారావు, అతని భార్య, బాలుడి(4)కి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్



సాక్షి,పాడేరు: బీజేపీ సీనియర్ నాయకుడు, పాడేరులోని చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెనుమాక రవికుమార్‌ను ఆ పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ఆయనకు గురువారం ఉత్తర్వులు అందాయి.

బీచ్ ఐటీ డెస్టినేషన్‌ను ప్రమోట్ చేస్తున్నాం



ఇన్ఫోసిస్‌లో ఏర్పాట్లని సమీక్షిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్



ఇన్ఫోసిస్ కార్యాలయం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఐటీ అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ విశాఖలో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి అమర్‌నాథ్, సందర్శించారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ డా.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ డా.సాయికాంత్‌వర్మ, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ఐటీ సెజ్ హిల్ నం.2లో 16న ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని సీఎం జగన్ ప్రారంభించి కంపెనీ ఉద్యోగులతో మాట్లాడతారని చెప్పారు.

విశాఖలో ఐటీ సంస్థల్ని ఆకర్షించేందుకు బీచ్ ఐటీ డెస్టినేషన్‌ని ప్రమోట్ చేస్తున్నామన్నారు. 1,000 మందితో ప్రారంభించి 3,000 మంది వరకు ఉద్యోగుల సంఖ్యని పెంచేదిశగా ఇన్ఫోసిస్ సంస్థ పయనించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రభుత్వ తరఫున కావాల్సిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ రాకతో.. మిగిలిన పెద్ద సంస్థలన్నీ విశాఖలో తమ శాఖల్ని విస్తరింపజేసే ఆలోచనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సాధించిందని, దానికి దీటుగా విశాఖ నగరాన్ని కూడా ఈ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ఇన్ఫోసిస్ కంపెనీలలో విశాఖకు చెందిన నాలుగు నుంచి ఐదు వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వారిని విశాఖ కార్యాలయానికి బదిలీ చేస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని ఇన్ఫోసిస్ యాజమాన్యం భావిస్తోందన్నారు. హిల్ నెం.2లో జరుగుతోన్న హెలిప్యాడ్ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం

బకులూరు సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



రిబ్బన్ కత్తిరించి సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పక్కన ఎంపీపీ

కొయ్యూరు: మండలంలోని బకులూరులో గ్రామ సచివాలయ భవనంతోపాటు రైతు భరోసా కేంద్రం భవనాన్ని పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి గురువారం సాయంత్రం ప్రారంభించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. నిజమైన గ్రామ స్వరాజ్యం వాటి ద్వారా సాకారమైందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ పాట్టిక శ్రీను, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, పార్టీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ సత్యవతి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



స్వామి వారి అర్చనకు స్వర్ణపుష్పాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

..శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిపించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కనకమ్మకు సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి. అనురాధ, ఎస్. సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

లడ్డూ ధర రూ.2.22 లక్షలు



రావికమతం: మండలంలోని గొంప, కొత్తకోట, మేడివాడ గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. కొత్తకోట గ్రామంలో 30 అడుగుల భారీ గణనాథుడిని ఆ స్థానంలోనే మోటార్లతో నీటిని చిమ్మి నిమజ్జనం చేశారు. అక్కడ వేలంలో లడ్డూ ఏకంగా రూ.2 లక్షల 22 వేలు పలికింది. అనకాపల్లి ఎంవీఆర్ ఫౌండేషన్ అధినేత ముత్యాల వెంకట రమణ కుమారుడు సతీష్, పలువురు వ్యాపారులు లడ్డూ వేలంలో పాల్గొన్నారు. చివరికి కమిటీ సభ్యులు 10 మంది కలిసి లడ్డూను దక్కించుకున్నారు. గొంప గ్రామంలోనూ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కళాకారిణి కవిత ప్రదర్శన ఆకట్టుకుంది.

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు

అరకు ఎమ్మెల్యే పాల్గుణ



విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, తదితరులు

అరకులోయ టౌన్: సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం స్థానిక ఆర్ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ 324 మంది పరీక్షలకు హాజరై 318 మంది ఉత్తీర్ణత (98 శాతం) సాధించడం అభినందనీయమన్నారు. పీజీలు, బీటెక్‌లతో ఉద్యోగావకాశాలు అంతంత మాత్రంగా ఉన్నాయని, ఐటీఐ పూర్తి చేసి, అప్రెంటీస్ చేసిన వారికి స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డ్, పోర్టుట్రస్ట్‌లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. తాను పదో తరగతి పాసై విశాఖ పాత ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రయినింగ్ పూర్తి చేసి, షిప్ యార్డ్‌లో ఉద్యోగం చేస్తూ ఇంటర్, డిగ్రీ చదివి ఉన్నత ఉద్యోగానికి వెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో పదో తరగతిలో ఫస్ట్ క్లాస్‌తో పాసైన వారికే ఐటీఐలో సీటు లభించేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఐటీఐల సంఖ్య పెంచడంతో ప్రతి ఒక్కరికీ సీటు లభిస్తుందన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కోసం అవసరమైతే తన సొంత నిధుల నుంచి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. హుకుంపేట మండలం గడుగుపల్లిలో ఐటీఐ మంజూరైందని, స్థల పరిశీలన చేశామన్నారు. త్వరలో సివిల్ వర్క్స్ ప్రారంభిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ప్రజలకు మంచి చేసే వారికి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ డి. వెంకటరావు, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎల్‌బీ భీమరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎల్బీ కిరణ్, ఐటీఐ సిబ్బంది పీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ రమణ, ఎల్ చిరంజీవి పాల్గొన్నారు.

గంజాయి జోలికి పోవద్దు

- మావోయిస్టు కోటలో గిరిజనులతో పోలీసుల మమేకం
- యువతకు వాలీబాల్ కిట్లు, రోగులకు మందుల పంపిణీ



చీపురుగొందిలో గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: పోలీసు శాఖ ఎప్పుడూ గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తుందని, గంజాయికి ప్రత్యామ్నాయంగా జీడి, రాజ్‌మా, సిల్వర్ ఓక్, కాఫీ వంటివి సాగు చేసుకోవాలని ఎస్ఐ కె. రవీంద్ర సూచించారు. మండలంలో మావోయిస్టుల కోటగా భావించే బూసిపుట్టు, కుమడ పంచాయతీల్లోని చీపురుగొంది, మద్దులబంద, పూలబంద, కిందుగూడ, సిర్లిమెట్ట, కిముడుపుట్టు, ఉప్పచెరువు, డెంగగూడ, సూల్తాన్‌పుట్టు, కొమ్ములకొండ, సరియపల్లి గ్రామాల్లో బుధ, గురువారం గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు సందర్శించారు. ఆ ప్రాంత గిరిజనులతో మమేకమై ప్రభుత్వం ఇటీవల చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ముఖ్యంగా గంజాయి సాగు, రవాణా జోలికి పోకూడదంటూ.. వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా పోలీసులు మద్దతుతో వేగంగా సెల్ టవర్ల నిర్మాణాలపై తెలియజేశారు. ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గిరిజన యువతకు అవగాహన కల్పించారు. వాలీబాల్ కిట్లు అందజేశారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, మెటల్‌రోడ్లు, సెల్ టవర్ల సమస్యలను జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండి, సంక్షేమ పథకాలను పొందుతూ అభివృద్ధి పథంలో నడవాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు.

వృత్తి నైపుణ్యం మెరుగుపరుచుకుంటే ఉపాధి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య

చింతపల్లి రూరల్: ప్రతి గిరిజన విద్యార్థి వృత్తి నైపుణ్యం మెరుగుపరుచుకుని ఉపాధి అవకాశాలు పొందాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. ప్రిన్సిపాల్ కె.రాజారావు ఆధ్వర్యాన స్థానిక ఐటీఐ కళాశాలలో కౌశల్ దీక్షాంత్ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక వృత్తిలో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ప్రపంచం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పలు కోర్సులపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారు. దీని ద్వారా నైపుణ్యం పెంచుకుని వారి జీవనోపాధికి మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీలు జయలక్ష్మి, పద్మ, వార్డు మెంబర్ రమణమ్మ, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు



గంజాయి సాగు భూమిలో పట్టుబడిన నిందితులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీసులు గురువారం చేపట్టిన వాహన తనిఖీల్లో 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. బైక్‌పై నర్సీపట్నం నుంచి ఏలేశ్వరం వైపు వెళ్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా గంజాయి బయటపడిందన్నారు. బైక్, గంజాయిని సీజ్ చేశామని, ఇద్దరు నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులను జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. నిందితుల్లో ఒకరు ఒడిశాలోని చిత్రకొండకు చెందిన బిత్తిలి బాబిలి, మరొకరు మలికిపురానికి చెందిన గుబ్బల సాయికిరణ్‌గా గుర్తించామన్నారు. గంజాయిని భీమవరం వైపు తీసుకువెళ్తూ పట్టుబడ్డారని ఎస్ఐ వివరించారు.

పిట్లపాడులో ఇద్దరిపై..

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ పిట్లపాడులో గంజాయి సాగు చేస్తున్న మర్రి నాగరాజు, వెంకటేష్‌లపై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేశామని మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా 102 గంజాయి మొక్కలను తొలగించామని చెప్పారు. మర్రి నాగరాజుకు చెందిన భూమిలో సాగు చేపట్టగా, అతనికి వెంకటేష్ సహకారం అందిస్తున్నారన్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ఈ ఆపరేషన్లో కొయ్యూరు ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు వేములోవ విద్యార్థినులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను అభినందిస్తున్న దృశ్యం

గంగవరం: కాకినాడలో ఈ నెల 10న జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వేములోవ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విదార్థినులు రేవుల దుర్గాప్రసన్న(లాంగ్ జంప్), కుంజం రాజేశ్వరి (షాట్‌పుట్) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు పీడీ బాలరాజును గురువారం స్థానిక పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ రత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రామ తులసి, నెల్లిపూడి ఎంపీటీసీ కనక లక్ష్మి, సర్పంచ్ మరిడమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో వై. మల్లేశ్వరరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి హాసిని, తదితరులు అభినందించారు.

సొంతిల్లు.. ఆనంద హరివిల్లు

- అంగరంగ వైభవంగా సామూహిక గృహ ప్రవేశాలు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్
- వెన్నెలపాలెంలో 174 గృహాల్లో ప్రవేశించిన లబ్ధిదారులు



జగనన్న కాలనీని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, హౌసింగ్ పీడీ రమామణి



జగనన్న కాలనీ స్వాగత ద్వారం

సాక్షి, అనకాపల్లి: ఇల్లు కట్టుకోవాలన్నది ప్రతి ఒక్కరి కల. స్తోమత ఉన్నవారికి సరే గానీ సామాన్యులకు అది అందని ద్రాక్షే. వారి ఆశలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞంలా చేపట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు' పథకం పేదల బతుకుల్లో వెలుగు తీసుకొచ్చింది. స్వప్నం సాకారం చేస్తూ వారిని ఓ ఇంటి వారిని చేసింది. గురువారం రాష్ట్రమంతటా అంగరంగ వైభవంగా సామూహిక గృహోత్సవాలు జరిగాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జగనన్న కాలనీలను ప్రారంభించారు. పరవాడ మండలం వెన్నెలపాలెంలో పరవాడ–1 లేఅవుట్ కూడా అందులో ఒకటి. ఈ కాలనీలో గల 174 గృహాలను ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్, హౌసింగ్ పీడీ రమామణి ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణల మధ్య లబ్ధిదారుల గృహప్రవేశం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకముందు కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పి.కనకారావు, ఎంపీడీఓ వి.హేమ సుందర్‌రావు, ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సీహెచ్ అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, గృహనిర్మాణ శాఖ డీఈ ప్రసాద్, ఏఈ ఎం.ఎ స్.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

174 ఇళ్లలో గృహప్రవేశం

పరవాడ మండలంలో 8 జగనన్న లేఅవుట్లలో 871 ఇళ్లు మంజూరు కాగా..వాటిలో 360 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో పరవాడ–1 లేఅవుట్ పరిధిలోని పరవాడ, వెన్నెలపాలెంలో 290 ఇళ్లు పూర్తి కాగా అందులో 174 ఇళ్లను గురువారం ప్రారంభించారు. వెన్నెలపాలెం లేఅవుట్‌లోని లబ్ధిదారులకు రూ.3.60 కోట్లు పంపిణీ చేశారు. కల్వర్ట్, డ్రెయిన్ల కోసం రూ.25 లక్షలు, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, స్వాగత తోరణానికి రూ.6.05 కోట్ల ఖర్చు చేశారు. అంతేకాకుండా 290 లబ్ధిదారులకు రూ.55 లక్షల రుణాలు మంజూరు చేశారు.

జిల్లాలో 34,394 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

అర్హులైన ప్రతీ పేదవానికి పక్కా గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా..'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు'లో భాగంగా అనకాపల్లి జిల్లాకు 68,466 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 682 లేఅవుట్లలో చేపట్టిన 34,394 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో మంజూరైన మొత్తం 68,466 ఇళ్లలో వైఎస్సార్ గృహ నిర్మాణంలో 62,954 ఇళ్లు కాగా టిడ్కో ఇళ్లు 5,512 ఉన్నాయి. పీఎంఏవై స్కీంలో భాగంగా 4,383 ఇళ్లను స్వంత స్థలంలో లబ్ధిదారుకు మంజూరు చేశారు. ప్రతీ ఇంటికీ రూ.1.80 లక్షల చొప్పున పూర్తి సబ్సిడీతో రూ.1054 కోట్లు నిధులు కేటాయించారు.